క్లుప్తంగా

శివునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయంలో సోమవారం శివునికి విశేష పూజలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన సౌకర్యం కల్పించారు.

ఎంపీడీవోగా దిలీప్‌కుమార్



దిలీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఈఓలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట ఎంపీడీవోగా దిలీప్‌కుమార్ నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో మంగళం శంకరయ్య గత నెల 28న పదవీ విరమణ పొందారు. దీంతో తంబళ్లపల్లె మండలం ఈవోపీఆర్డీగా పని చేస్తున్న దిలీప్‌కుమార్‌కు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఖాదర్ వలీ, వైఎస్ఆర్‌సీపీ బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డిహరి, ఎంఈఓలు రెడ్డిశేఖర్ భీమేశ్వరాచారీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిజాద్ ప్యారీ, ఎమ్మార్సీ సిబ్బంది వేర్వేరుగా సత్కరించారు.

20 మందికి జిందాల్ స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు లభించిన విద్యార్థులు

కురబలకోట : అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థులు 20 మందికి ప్రతిష్టాత్మక సీతారామ్ జిందాల్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. మెరిట్‌ను దృష్టిలో ఉంచుకుని రూ. 9 వేల నుంచి రూ. 14,400 చొప్పున ఈ స్కాలర్ షిప్‌లు లభించాయని తెలిపారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీవో శివశంకర్

పీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 2023–24లో చేపట్టిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయిలో పనుల పరిశీలనతోపాటు గ్రామ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు అశోక్‌రెడ్డి, మహేష్, ఎస్ఆర్‌పీ ముర్షాద్, పీఆర్ ఏఈ రాజునాయక్, హౌసింగ్ ఏఈ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

ఒంటిమిట్ట : ప్రపంచ మహిళా దినోత్సవంలో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రంలో వారోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఒంటిమిట్ట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో సచివాలయ మహిళా ఉద్యోగులను సన్మానించారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన కల్పించి ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు.

'మిలాన్'లో రాణించిన విద్యార్థులు

రాజంపేట రూరల్ : గుంటూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మిలాన్ ఉత్సవ్‌లో అన్నమాచార్య ఫార్మసీ విద్యార్థులు రాణించినట్లు కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలియజేశారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీలో సోమవారం రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారథులు డి.అక్బర్‌వలీ, టి.వినోద్‌కుమార్, వై.సాయిమేఘనాథ్‌రెడ్డి, డి.గణేష్, ఎస్.హుస్సైన్, ఎం.మహేష్‌బాబు, జి.వెంకటపవన్, డి.తరుణ్ బృందం కబడ్డీ పోటీలలో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలియజేశారు. అదే విధంగా 3వ సంవత్సరం ఫార్మా డీ విద్యార్థి డి.గణేష్ రెండవ బహుమతి సాధించినట్లు తెలియజేశారు. ఈ అభినందన సభలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎం.మధు, అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.హాంజాబేగ్‌లు పాల్గొని అభినందించారు.

● అశ్వవాహనంపై సిద్దేశ్వరుడు



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏకిరి కులస్తులు అలంకరించిన చాందినీ బండిపై వారికి కేటాయించిన అశ్వవాహనంపై శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామిని ఊరేగించారు. ముందుగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామి రథం ముందు కోలాటం, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

– కలకడ

● మల్లమ్మకు విశేష పూజలు



తంబళ్లపల్లె సమీపంలో వెలసిన శ్రీ భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏనుగుమల్లమ్మ ఆలయంలో పూజారులు శేఖర్, విజయమ్మలు పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున మల్లయ్యకొండను సందర్శించారు.

– తంబళ్లపల్లె

సారా రహితంగా మార్చుదాం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్‌ను నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయంగా ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని రూపొందించిందని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నారమాకులతండాలో నవోదయం 2.0 కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ సీఐ భీమలింగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో.. ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఎస్ మధుసూదన్, ఏఈఎస్ జోగేంద్ర, మండల తహసీల్దార్ ధనంజయులు, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, రూరల్ సీఐ కళావెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ నాటుసారాపై ప్రజల్లో అవగాహన కల్పించి రాష్ట్రంలో నాటుసారాను నిర్మూలించడమే నవోదయం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో భాగంగా... నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించారు. నాటుసారా తాగడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నాటుసారా అమ్మడం, తయారుచేయడం, రవాణాచేయడం, కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని, ఈ నేరం చేసిన వారికి 8 సంవత్సరాల జైలుశిక్షతోపాటు రూ.5 లక్షల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా తయారు చేస్తున్నా, రవాణా చేసినా, అమ్మినా, నిల్వ ఉంచినా ఎక్సైజ్, పోలీస్ అధికారులకు లేదా రాష్ట్ర కంట్రోల్ రూమ్ నంబర్ 14405 లేదా మదనపల్లె ఎక్సైజ్ సీఐ 9440902533 నంబర్‌కు సమాచారం తెలపాలన్నారు. అనంతరం నవోదయం 2.0 వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు.

శ్మశాన వాటికకు దారి లేదని నిరసన



శ్మశాన వాటికలో ఎస్సీ సంఘాల నాయకుల నిరసన

బి.కొత్తకోట : పదేళ్ల క్రితం కేటాయించిన శ్మశాన వాటిక స్థలానికి దారిలేదని బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెలో ఎస్సీ సంఘాల నాయకులు శ్మశాన వాటికలో కూర్చుని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బడికాయలపల్లెలో 150 ఎస్సీ కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరి కోసం పదేళ్ల క్రితం గ్రామంలోనే సర్వే నంబర్ 513లో 0.32 సెంట్ల భూమిని కేటాయించారు. ఎవరైనా మరణిస్తే ఖననం చేసేందుకు వెళ్లాలంటే దారి లేదు. చుట్టూ ప్రైవేట్ భూములు ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంపై ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ శ్మశానవాటిక వద్ద నిరసన తెలియజేశారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారే తప్ప.. ఇప్పటి దాకా పరిష్కారం చూపలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు. ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారానికి మానిటరింగ్ కమిటీ సమావేశాలు ప్రతి నెలా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిరసనలో ఎస్సీ సంఘాల నాయకులు జీలకర్ర నరసింహులు, వెంకటప్ప, ఎం.రెడ్డెప్ప, పి.నరసింహులు, కుక్కల శంకర, పలక గంగప్ప, ఏపీఎస్ఆర్‌జేసీ జిల్లా అధ్యక్షులు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

కలికిరి : తిరుపతిలో ఈ నెల 23న జరగనున్న మాలల సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్టీడి హరి అన్నారు. మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీలోని పాతదళితవాడలో సోమవారం మాలల సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సింహగర్జన సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు రమేష్‌బాబు, సహదేవ, గురు, రామ, బ్యాంక్ రెడ్డెప్ప, గంగాధర, గిరి, సురేష్, వెంకటస్వామి, శ్రీనివాసులు, విజయ్, శ్యామ్యూల్, చంద్ర, క్రిష్ణ, రంగన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది

రామసముద్రం : మండలంలోని బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీ వాలీశ్వరస్వామి, అంతరగంగమ్మ ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం నిర్వహించారు. తాత్కాలిక ఉత్సవ కమిటీ ఇటీవల జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయానికి వచ్చే భక్తుల కానుకల కోసం నూతనంగా హుండీలు ఏర్పాటు చేశారు. అందులో వచ్చిన నగదు, కానుకలను దేవదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, ఎండోమెంట్ ఈఓ రమణ, అకౌంటెంట్ బాల అంకన్న, పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీ, అర్చకుల సమక్షంలో లెక్కింపు చేశారు. మొత్తం రూ.1,69,318 వచ్చినట్లు కమిటీ వారు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయం పేరుతో ఖాతా తెరచి బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎంప్లాయీస్ యూనియన్ నుంచి ఎస్ఎంయూలో చేరిన నాయకులు

పీలేరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఎంయూ గౌరవాధ్యక్షులు వై.రెడ్డెప్పరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డిపోలో ఎస్ఎంయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఎంప్లాయీస్ యూనియన్ నుంచి 20 మంది ఎస్ఎంయూలో చేరారు. ఇందులో డ్రైవర్లు ఎ.రామచంద్ర, కె.ప్రతాప్, డి.హరినాథ్, కె.కృష్ణయ్య, కె.ఎస్.రామయ్య, పి.రామకృష్ణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం.రాజు, డిపో ప్రెసిడెంట్ సి.వి.రమణ, వైస్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

రాయచోటి అర్బన్ : ఆప్కాస్ ద్వారా ఎంపికై విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ కార్మికులందరిని వెంటనే క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, ఏపీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. శ్రీనివాసులు, వి.సురేష్ కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 2 ద్వారా ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటీఎస్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేశవరావు, నాగరాజు, పృథ్వీరాజ్ తిరుమల, దేవ, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సు.దీర్‌కుమార్, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



కలకడ : పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

తంబళ్లపల్లె : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో సోమవారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చీఫ్ సూపరింటెండెంట్ రామాంజనేయప్రసాద్, డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. 123 మంది విద్యార్థులకుగాను 122 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు, కోసువారిపల్లె మెడికల్ ఆఫీసర్ అనుపమ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ రాధాకృష్ణ తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రం వద్ద బయటి వ్యక్తులు ఉండరాదు

కలకడ : పరీక్ష కేంద్రం వద్ద బయటివ్యక్తులు ఎవరూ ఉండరాదని పరీక్ష కేంద్రం చుట్టుపక్కల 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ రామాంజనేయులు హెచ్చరించారు. సోమవారం కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే సమయంలో, పరీక్ష రాసిన అనంతరం ఇంటికి వెళ్లే సమయంలో జాగ్రత్తగా వెళ్లాలని తెలిపారు. ఎలాంటి ఆకతాయిలు ఉన్నా సిబ్బందికి గానీ, తనకు గానీ తెలియజేయాలని సూచించారు. ద్వితీయ సంవత్సరం మొదటి పరీక్షకు 6 కళాశాలల నుంచి 332 మందిని కేటాయించగా ముగ్గురు గైర్హాజరై 329 మంది హాజరైనట్లు పరీక్ష చీఫ్ పుష్పకుమారి, డిపార్ట్‌మెంటల్ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో కలిసి నినాదాలు చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మదనపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మార్చి 12న విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాకు ప్రతి గ్రామం నుంచి పేదలు, వ్యవసాయ, ఉపాధి కూలీలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని కొండామారిపల్లె, బోడిమల్లుదిన్నె, బెస్తపల్లె, పోతబోలు, ఎనుములవారిపల్లె, చిలకవారిపల్లె గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పర్యటించి మహాధర్నా కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కూలీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. పేదలకు అన్నం పెడుతున్న ఉపాధి చట్టానికి డబ్బులు తగ్గించారని, ప్రజాపంపిణీకి కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల చేతుల్లోని జానెడు భూమిని లాక్కుని పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని, చివరకు చనిపోతే పాతిపెట్టేందుకు 6 అడుగుల నేల కూడా లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ రాష్ట్రంలో 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటే, వారిలో ఎక్కువశాతం మంది కౌలు రైతులేనని, కౌలు చేసేవారంతా పేదరైతులేనని, వీరికి ఎలాంటి చట్టాలు లేవని, ఉన్నా అమలు జరగడం లేదని వివరించారు. హక్కుల సాధన కోసం పేదలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని, డిమాండ్ల సాధన కోసం మార్చి 12వ తేదీ బుధవారం విజయవాడలో జరుగుతున్న మహాధర్నా జయప్రదం చేయాల్సిన అవసరం ఉన్నదని, ప్రతి గ్రామం నుండి పేదలు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరిశర్మ, రఘునాథ్, సుధాకర్, వెంకటరమణ, భూదేవి, భార్గవి, వెంకటమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సురేంద్రారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టణ పరిధిలోని రాంనగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు క్రిష్టారెడ్డిగారి సురేంద్రారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉంటున్నాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం ఉదయం వారి ఇంటికెళ్లి పరామర్శించారు. సకాలంలో వైద్య సేవలు చేయించుకోవాలని సూచించారు. త్వరగా పూర్తి స్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించి ఆయనకు ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, తరిగొండ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీ ఉపయోగించుకోవాలి

మదనపల్లె సిటీ : ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని మణిపాల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రవిల్లా అన్నారు. సోమవారం చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో 5జీ, 6జీ కమ్యూనికేషన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ రోజు రోజుకు కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. విద్యార్థులు అందుకు అనుగుణంగా మేధస్సును పెంచుకోవాలన్నారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్ అభిప్రాయాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్ బాబు, ఈసీఈ విభాగాధిపతి వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో బాల్యవివాహాలు నిర్మూలిద్దాం



పీలేరు :ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వెలుగు అధికారులు, సిబ్బంది

పీలేరు : సమష్టి కృషితో బాల్యవివాహాలు నిర్మూలిద్దామని సీడీపీవో రాజమ్మ, వెలుగు ఏపీఎం జవహర్‌బాషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 'మిషన్ సఖీ' కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఆడపిల్లల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సి.రాజమ్మ, స్వర్ణ, ఉమ, సోషల్ వర్కర్ లావణ్య, సీసీలు చంద్రకళ, మంజుల, కవిత, అహ్మద్‌బాషా, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెద్దతిప్పసముద్రం : మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ హరిహర ప్రసాద్ అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం పోలీసులు విద్యార్థులతో కలసి స్థానిక బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన ఎస్ఐ ప్రభుత్వ చట్టాలు, నిందితులను ఎలా గుర్తిస్తారు, నిర్ధారణ అయ్యాకా నిందితుడికి శిక్ష పడే విధానం, పోక్సో కేసు, కేసులను ఛేదించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.



పెద్దతిప్పసముద్రం : విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిహర ప్రసాద్

వాట్సాప్‌లో హాల్ టికెట్లు

బి.కొత్తకోట : పదో తరగతి విద్యార్థులు మనమిత్ర వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు పొందాలని ఎంఈఓ రెడ్డిశేఖర్ సోమవారం తెలిపారు. వాట్సాప్ నంబరు నుంచి హాయ్ అని మెసేజ్ పెడితే వివరాలు కనిపిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు పరిష్కరిస్తారని తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

తంబళ్లపల్లె : పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ సుమిత్ర కోరారు. సోమవారం మండలంలోని కోటకొండ, మద్దిరాళ్లపల్లె, దేవరబురుజు గ్రామాల్లో జెఈఓ కిరణ్, హేమాపతిరెడ్డి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, దూడలకు బ్రూసెల్లో టీకాలు వేశారు. కార్యక్రమం ఈనెల 30వతేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'అసత్య ఆరోపణలు మానుకోండి'

నందలూరు : రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ రెడ్డిని విమర్శించే స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు తేల్చి చెప్పారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి నాయకులు పాలన చేయడం చేతకాక ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నాయకులపై విమర్శలకు దిగుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి హవాను తట్టుకొని ఆకేపాటి ఎమ్మెల్యే గెలుపొందారన్నారు. రాజంపేట ప్రజలకు ఆయన కుటుంబం చేసిన సేవలే ఆయన్ను ఎమ్మెల్యేను చేశాయని చెప్పారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆకేపాటి మేడా విజయశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలను వారు ఖండించారు. తాను ఏ ఆక్రమణలు చేయలేదని ప్రభుత్వం సర్వే చేసి తీసుకోవచ్చని తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేగాని ఇలా అసత్య ఆరోపణలు చేయడం ఆపాలని తెలుగుదేశం నాయకులకు హితవు పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, జడ్పీటీసీ గడికోట వెంకట సుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, గొబ్బిళ్ల త్రినాథ్ యాదవ్, నడివీధి సుధాకర్, గుండు మల్లికార్జున, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, ఇబ్బు, రవిరాజు, ఆనాల మధు యాదవ్, మోడపోతుల సుధాకర్, మధురాజు, కామాక్షి, నవాబ్, రాజశేఖర్ రెడ్డి, శంకర్, మహబూబ్ బాషా, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య డాక్టర్‌గా ఇన్‌చార్జి నియామకం

పెద్దతిప్పసముద్రం : మండల పశు వైద్య డాక్టర్‌గా ఇన్‌చార్జిని నియమించారు. పెద్దమండ్యం మండలంలో పని చేస్తున్న డాక్టర్ విక్రంరెడ్డిని పెద్దతిప్పసముద్రానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్నాళ్లు ఇక్కడ వెటర్నరీ డాక్టర్‌గా పని చేసిన రమేష్ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు.

గుత్తల వేలం వాయిదా

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలోని గుత్తలకు నిర్వహించిన వేలంపాటల్లో వారపుసంత, ప్రైవేట్ బస్టాండ్ వాయిదా పడింది. సోమవారం కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ పల్లవి వేలం పాటలు నిర్వహించారు. ఇందులో దినసరి మార్కెట్ రూ.1,57,500 పాటకు దక్కించుకున్నారు. వారపుసంత, ప్రైవేట్ బస్టాండ్‌కు ఆశించిన మేరకు వేలం పాడుకోవడంతో వాయిదా వేశారు. వీటికి మరోసారి వేలం పాట నిర్వహిస్తామని కమిషనర్ పల్లవి తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

వీరబల్లి : రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలను వీరబల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా పదవులు పొందిన వారు ఎంపీలను గజమాలతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలని ఎంపీ మేడా నాయకులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని తెలియజేశారు. ఎంపీని కలిసిన వారిలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిగుట్ల అమర్నాథ్ రెడ్డి, వీరబల్లి మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణిరాజు, మాదిరెడ్డి నారాయణ రెడ్డి, ఎర్రపురెడ్డి పురుషోత్తం రెడ్డి, నరేష్ స్వామిలు ఉన్నారు.

రేకుల షెడ్లు తొలగించాలి

గాలివీడు : ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను వెంటనే తొలగించకపోతే చర్యలు తప్పవని ఆక్రమణదారులను ఏఈ ధర్మారెడ్డి హెచ్చరించారు. డీఈ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని గుర్రాలమిట్ట వద్ద సర్వే నంబర్ 467,475/5బి, 475/6 ఆక్రమణలో ఉన్న రేకుల షెడ్లను వీఆర్వో అల్లబకాష్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణదారులకు మూడు రోజులు గడువు ఇచ్చామని ఈలోపు రేకుల షెడ్లు తొలగించకపోతే తామే స్వయంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై నిషేధాన్ని కఠినంగా అమలుచేయండి

రాయచోటి అర్బన్ : జిల్లాలో ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై ఉన్న నిషేధాన్ని కఠినంగా అమలుచేయాలని జనసేన పార్టీ నేత రామ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం ఆయన ఆ పార్టీ నేతలతో కలసి కలెక్టర్‌ను కలుసుకున్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వాడకం ద్వారా ప్రజారోగ్యం దెబ్బతింటోందన్నారు. ప్లాస్టిక్ గ్లాస్, కవర్‌లు, కప్పులు తదితరాల వాడకాన్ని నివారించాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల క్రయ, విక్రయాలను నిషేధించడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు కృషిచేయాలంటూ కోరారు.